సాక్షి సంగారెడ్డి

బుధవారం । 6 । ఆగస్టు । 2025



మహిళామణులు

సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలు తమ శక్తిని చాటుతున్నారు.

వివరాలు 10లో ▸



పరిశ్రమలో లీకైన కెమికల్

శ్రేయాన్స్ ల్యాబ్ కెమికల్ పరిశ్రమలో కెమికల్ లీకై ఎనిమిది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు.

వివరాలు 10లో ▸



ఆన్‌లైన్ బెట్టింగ్ వలలో చిక్కి..

ఆన్‌లైన్ బెట్టింగ్ వలలో చిక్కుకున్న ఓ యువకుడు అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాలు 10లో ▸

న్యూస్‌రీల్

డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే మాణిక్‌రావు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: జహీరాబాద్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుల్లో జరుగుతున్న జాప్యం జరుగుతోందని, వెంటనే పేదలకు వాటిని అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని 660 మంది లబ్ధిదారులకు లాటరీ విధానంలో ఎంపిక చేసి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయిచినట్లు గుర్తు చేశారు. లబ్ధిదారుల ఎంపిక నిష్పక్షపాతంగా ఉండాలని, అర్హులైన వారందరికీ పార్టీలకు అతీతంగా అందజేయాలని ఆయన కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నారాయణ, పాక్స్ చైర్మన్ మచ్చేందర్, బీఆర్‌ఎస్ నాయకులు మొహియొద్దీన్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

మహిళా ప్రొటెక్షన్ సెల్ చైర్‌పర్సన్‌గా సుశీల



నారాయణఖేడ్: నేషనల్ హ్యూమన్‌రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ సంస్థ మహిళా ప్రొటెక్షన్ సెల్ నిజాంపేట మండల చైర్‌పర్సన్‌గా సుశీల నియమితులయ్యారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం ఈ మేరకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి మైనొద్దీన్, జిల్లా ఇతర బాధ్యులు రాజ్‌కుమార్, అఖిల్ పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడి

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



రైతులకు అవగాహన కల్పిస్తున్న శివప్రసాద్

జిన్నారం (పటాన్‌చెరు): రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం గుమ్మడిదల రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతునేస్తం కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటసాగు సమయంలో వెదజల్లే పద్ధతి ద్వారా వరి పంటసాగులో ఉత్తమ ఫలితాలు ఉంటాయని, దాని వల్లన అధిక మొత్తంలో పంట దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులకు ఖర్చు ఆదా అవుతుందని వివరించారు. యూరియా బదులు నానో యూరియా వాడాలని, రైతులు ఆయిల్ పామ్ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్‌రావు, ఏఈవోలు నిఖిత, ప్రణవి, రైతులు పాల్గొన్నారు.

సీఎస్‌ఈలో డాక్టర్ సుధారాణికి పీహెచ్‌డీ



పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ) విభాగం పరిశోధక విద్యార్థిని సీహెచ్ సుధారాణి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'సమగ్ర చొరబాటు గుర్తింపు వ్యవస్థ ఫ్రేమ్ వర్క్ కోసం అధునాతన ఆప్టిమైజేషన్ అల్గారిథమ్‌లు, మెషిన్ లెర్నింగ్ టెక్నిక్‌ల రూపకల్పన'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి నెట్ వర్క్ భద్రతను మెరుగుపరచడంలో గణనీయమైన సహకారాన్ని అందించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సీఎస్‌ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. యుగంధర్ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామయ్య, సీఎస్‌ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు డాక్టర్ సుధారాణి ని అభినందించారు.

సర్కార్ బడుల్లో సంగీతం

- పీఎంశ్రీ కింద 37 పాఠశాలలు ఎంపిక
- ఆయా పాఠశాలలకు చేరిన సంగీతం పరికరాలు

సర్కార్ బడుల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. చదువుతో పాటు క్రీడలు, కరాటే విద్య,ను అందిస్తున్న ప్రభుత్వాలు.. తాజాగా సంగీతం పాఠాలు అందించాలని నిర్ణయించాయి. పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలకు ఇదివరకే సామగ్రి కూడా చేరింది. త్వరలో విద్యార్థులకు సంగీతం పాఠాలు బోధించనున్నారు.



న్యాల్‌కల్‌లోని కేజీబీవీకి చేరిన సంగీతం పరికరాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లాలో 1,236 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. అందులో పీఎంశ్రీ (ప్రైం మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద 37 పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసింది. నారాయణఖేడ్, నేరేడిగుంట, శివంపేట్, చాప్టా(కె), బాచపల్లి, సిర్గాపూర్, శేఖాపూర్, దిగ్వాల్, న్యాల్‌కల్, బొల్లారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, తెల్లాపూర్, బీహెచ్‌ఈఎల్, తొగుర్‌పల్లి, నందికంది, ఇస్మాల్‌ఖాన్‌పేట్, చేర్యాల్, సిరిపుర, సదాశివపేట్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలు ఎంపిక కాగా, అందోల్, సింగూర్, దిగ్వాల్, జహీరాబాద్, రాయికోడ్, నాగిల్‌గిద్ద, లింగంపల్లి, జిన్నారం, ఇస్మాపూర్(బాలికలు), కంది, కొండాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటితో పాటు మోర్గి, పాతులబొగుడ, ఝరాసంగం, మోడల్ స్కూళ్లు, న్యాల్‌కల్ కేజీబీవీ పీఎంశ్రీ కింద ఎంపికయ్యాయి.

పాఠశాలలకు చేరిన సంగీతం పరికరాలు

పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలకు సంగీతం పరికరాలు చేరుకున్నాయి. తబల, డోల్, హార్మోనియం, వయోలిన్ తదితర పరికరాలు ఇటీవల అన్ని పాఠశాలలకు చేరాయి. సంగీతం పాఠాల వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుంది. సంగీతం వినడం వల్ల విద్యార్థులకు కొత్త ఆలోచనలు వస్తాయి. వీటితో పాటు అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. పాఠశాలలకు సంగీతం వాయిద్యాలను ప్రభుత్వం సరఫరా చేసి సుమారు నెల రోజులు కావస్తున్నా.. ఇప్పటి వరకు సంగీతం పాఠాలు బోధించే (శిక్షకులు) ఉపాధ్యాయులను మాత్రం ఇంత వరకు నియమించలేదు. ప్రభుత్వం చర్యలు తీసుకొని సంగీతం బోధించే ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు ఎంతో మేలు



ప్రభుత్వ పాఠశాలల్లో సంగీతం పాఠాలు నేర్పడం వల్ల విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుంది. తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులకు.. సంగీతం పాఠాల వల్ల ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుంది. వారిలో దాగి ఉన్న సంగీతం పాఠాల ప్రతిభ, సృజనాత్మకత వెలికి వస్తుంది.

–సచ్చిదానందరెడ్డి, హెచ్‌ఎం జడ్పీహెచ్‌ఎస్, న్యాల్‌కల్

త్వరలో శిక్షకుల నియామకం



పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 37 పాఠశాలలు ఎంపిక చేశాం. అన్ని పాఠశాలలకు సంగీతం పరికరాలు పంపిణీ చేశాం. వారంలో ఒక రోజు సంగీతం పాఠాలు బోధించడం జరుగుతుంది. నిబంధనల ప్రకారం త్వరలో శిక్షకుల నియామకం కూడా చేపడుతాం.

–వెంకటేశ్వర్లు, డీఈఓ



పెట్రోల్ బంక్ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఉద్యోగాలు సృష్టించే దిశగా మహిళలు

- ఇది శుభ పరిణామం: కలెక్టర్
- మహిళా సంఘాల పెట్రోల్ బంక్ సందర్శన

సంగారెడ్డి జోన్: మహిళలు ఉద్యోగాలు సృష్టించే దిశగా అడుగులు వేస్తున్నారని, ఇది శుభ పరిణామం అని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పెట్రోల్ బంక్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా సంఘాలలోని సభ్యులను కోటీశ్వరులను చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. మహిళల చేతుల్లో ఉన్న పెట్రోల్ బంక్ ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉండాలన్నారు. బంకు సంబంధించిన రికార్డులు సరైన విధంగా నిర్వహించాలని కోరారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అమ్మకాలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీఓ సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల వరకు తల్లిపాలు ముఖ్యం

బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలే ముఖ్యమని కలెక్టర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మంగళవారం పోతిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. చిన్నారులకు నాణ్యమైన భోజనంతో పాటు మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి పాల్గొన్నారు.

కేసుల ఛేదనకు కార్యాచరణ



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ పంకజ్

- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన
- ఎస్పీ పరితోష్ పంకజ్
- పటాన్‌చెరు స్టేషన్ ఆకస్మిక తనిఖీ

పటాన్‌చెరు టౌన్: పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విచారణ పారదర్శకంగా ఉండాలన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు జరుగుతున్న ప్రాంతాలను హాట్ స్పాట్‌గా గుర్తించి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీఐలకు సూచించారు. మారుతున్న కాలానుగుణంగా ఎలాంటి విధులు, సవాళ్లను అధిగమించేలా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. పటాన్‌చెరు సబ్‌డివిజన్ ఏరియాలో అధికంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాల నివారణ గురించి ప్రజలు, విద్యాసంస్థలలో, కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణ, జరిగిన నేరాలను ఛేదించడానికి కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలన్నారు. కాగా, స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడారు. ఆయన వెంట పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐలు వినాయక్ రెడ్డి, నరేష్, విజయ్‌కృష్ణ, నయీముద్దీన్, ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్, క్రైమ్ సీఐ రాజు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కిచ్చన్నపల్లి అంగన్‌వాడీ టీచర్, ఆయా సస్పెండ్

వట్‌పల్లి(అందోల్): అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించడం పట్ల అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా సుజాతను సస్పెండ్ చేశారు. చిన్నారులకు పురుగుల అన్నం ముక్కిపోయిన పప్పు వండి పెడుతున్నారని గ్రామస్తులు ఈనెల 2న అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మంగళవారం జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి విచారణ చేపట్టారు. దీంతో వారిద్దరిపై వేటు వేశారు. రాంసాన్‌పల్లి టీచర్‌కు ఇంచార్జీ బాధ్యతలు అప్పగించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

మెదక్ కలెక్టరేట్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నా రు. విద్యారంగ బడ్జెట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్ర చేస్తోందని ఆరోపించారు.

కాళేశ్వరంపై కుటిల రాజకీయాలు



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

- కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాంగ్రెస్ కుట్ర
- హామీలపై నిలదీస్తున్నారని డైవర్షన్ పాలిటిక్స్
- వాస్తవాలను ప్రజలకు వివరిస్తాం
- బీఆర్‌ఎస్ నేతల స్పష్టీకరణ
- కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వీక్షణ

సంగారెడ్డి: కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట తమ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, పార్టీ నాయకులు వీక్షించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం అద్భుతమైన ప్రాజెక్టు అని, సాగునీటితో వ్యవసాయరంగాన్ని స్థిరీకరించారని తెలిపారు. వ్యవసాయం, తాగునీటికి ఎంతో ఉపయోగపడే కాళేశ్వరంను విఫల ప్రాజెక్టుగా చిత్రీకరించేందుకు కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు పాల్పడుతోందని వారు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ఆరోపణలను హరీశ్‌రావు తిప్పికొట్టారని చెప్పారు. ప్రాణహిత చేవెళ్లకు అనుమతి లేకున్నా.. ప్రాజెక్టు కట్టకుండా జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేశారని వారు ఆరోపించారు. అలాంటి వారు కాళేశ్వరంపై మాట్లాడే అర్హత లేదన్నారు. ఆరు గ్యారెంటీల విషయమై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తుందని, అందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేసేదాకా వదిలి పెట్టేది లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే రైతులకు నీరు అందిందని, కేసీఆర్‌కు మంచి పేరు రాకూడదని బురద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై గ్రామాల్లో ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ఆటలు ఇక సాగనివ్వబోమని స్పష్టం చేశారు.



ఫతేనహర్ కెనాల్‌ను జేసీబీతో శుభ్రం చేయిస్తున్న రైతులు

మడి తడపని మంజీరా

- ఘనపురం నీటి కోసం రైతన్నల పాట్లు
- ఫతేనహర్ కెనాల్ నిర్మాణంలో లోపాలు
- చివరి ఆయకట్టుకు కన్నీరు

పాపన్నపేట(మెదక్): తలాపునే ఘనపురం ప్రాజెక్టు ఉన్నా.. మడి తడవని పరిస్థితి. ఫతేనహర్ కెనాల్ నీరు దౌలాపూర్ గుట్టలను దాటి పాపన్నపేట చేరాలంటే ఏటా భగీరథ యత్నమే. కెనాల్ నిర్మాణంలో ఉన్న లోపాలు అన్నదాతకు శాపంగా మారాయి. కాలువ కింద ఉన్న ప్రతి గ్రామానికి నీరు అందినా, చివరి ఆయకట్టు పాపన్నపేటకు మాత్రం కన్నీరే దిక్కవుతుంది. ఎలాగైనా కాలువ నీటిని మళ్లించి, ఎండి పోతున్న పంటలను రక్షించుకోవాలన్న ఆశతో రైతులు జేసీబీతో కాలువ తీశారు. కానీ మంజీరా నీరు మాత్రం వారి మడులకు చేరలేదు.

ఘనపురం.. జీవనాధారం

ఘనపురం ఆనకట్ట పాపన్నపేట మండలానికి జీవనాధారం. అయితే ఫతేనహర్ కెనాల్ నిర్మాణం పాపన్నపేటకు వచ్చే సరికి ఎత్తుగా మారుతుంది. దీంతో పైన ఉన్న అన్ని గ్రామాల రైతులు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తే పాపన్నపేటకు నీరందని పరిస్థితి. ఈ కాలువల పునర్నిర్మాణం చేయాలని దశాబ్దాలుగా రైతులు డిమాండ్ చేస్తున్నా, వారి వేదన అరణ్య రోదనగానే మిగిలింది.

వాడుముఖం పట్టిన వరినాట్లు

వరుణుడు కరుణించక మండలంలో వేసిన వరినాట్లు వాడుముఖం పట్టాయి. ఇతర గ్రామాలకు ఘణపురం ఆనకట్ట నీరు ఫతేనహర్ కెనాల్ ద్వారా అందుతున్నా, పాపన్నపేట రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అసలే కాలువ నిర్మాణం నీటి ప్రవాహానికి వ్యతిరేకం.. ఆపై నిర్వహణ కరువై పిచ్చి మొక్కలు పేరుకు పోయాయి. దీంతో రైతన్నలు తలా ఇంత చందాలు వేసుకొని జేసీబీతో కాలువ శుభ్రం చేయించారు. అయినా, ఆశించిన ఫలితం దక్కలేదు. దీంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఎగువన ఉన్న గ్రామాల రైతులు తమ వైపు వెళ్లే నీటికి అడ్డుకట్ట వేస్తే, పాపన్నపేటకు నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఒకవేళ ఆ నీరు వస్తే, మొదట చౌదరి చెరువు, ఆపై పాత చెరువులోకి నీరు చేరి సుమారు 300 ఎకరాల్లో పంటలు పండుతాయని పేర్కొంటున్నారు.

వార్డుల వారీగా ఓటరు జాబితా

కొత్త జాబితా రూపకల్పన


- ఎంపీడీఓ నుంచి కార్యదర్శికి లాగిన్
- ప్రక్రియ ప్రారంభించిన అధికారులు

జిల్లాలోని మండలాలు	26
గ్రామ పంచాయతీలు	631
పోలింగ్ స్టేషన్‌లు	5542

సంగారెడ్డి జోన్: గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కొత్తగా ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వార్డుల వారీగా కొత్త ఓటరు జాబితా అందుబాటులోకి రానుంది. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా కీలకమైన ఓటరు జాబితా ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 26 మండలాలు ఉండగా 631 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఆయా మండలాలలో 7,83,379 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 5,542 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. ఓటర్ల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వార్డుల వారీగా ఓటర్లను గుర్తించి ఒక కుటుంబ సభ్యులంతా ఒకే వార్డులో ఓటు వేసే విధంగా రూపొందిస్తున్నారు. నూతనంగా రూపొందించే జాబితాలో పలు మార్పులు, చేయనున్నారు. చనిపోయిన వారిని గుర్తించడంతో పాటు తప్పుగా పేర్లు నమోదైన వారు సరి చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

గ్రామపంచాయతీ కార్యదర్శి లాగిన్

ఇప్పటికే రూపొందించిన ఓటరు జాబితా ఎంపీడీవో లాగిన్ ఆధారంగా నిర్వహించారు. ప్రస్తుతం సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి లాగిన్ అవకాశం కల్పించి కొత్తగా రూపొందించిన ఓటరు జాబితా టీ పోల్‌లో అప్ లోడ్ చేయనున్నారు. ఇప్పటివరకు మ్యానువల్ పద్ధతిలో ఓటరు జాబితాను రూపొందిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేస్తారు. ప్రస్తుత ఓటరు జాబితా స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా రూపొందిస్తున్నారు.



జిల్లాలోని ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	స్త్రీలు	పురుషులు	ఇతరులు
అందోల్	84948	82015	6
నారాయణఖేడ్	95075	95964	6
నర్సాపూర్	21919	20797	2
పటాన్‌చెరు	29261	20797	2
సంగారెడ్డి	68688	65908	27
జహీరాబాద్	95491	95047	2

తగ్గనున్న గ్రామపంచాయతీలు, వార్డులు

కొన్ని నెలల క్రితం పలు గ్రామపంచాయతీ లను విలీనం చేయడంతో పాటు కొన్ని గ్రామపంచాయతీలను కలుపుతూ కొత్తగా మునిసిపాలిటీలను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామపంచాయతీలతో పాటు వార్డుల సంఖ్య తగ్గిపోయింది. జిల్లాలోని పటాన్‌చెరు, జిన్నారం మండలంలోని సుమారు 18 గ్రామ పంచాయతీలను కలుపుతూ కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడుతున్నాయి. దీంతో త్వరలో జిల్లాలో గ్రామపంచాయతీ లతో పాటు వార్డుల సంఖ్య తగ్గిపోనుంది.

క్లుప్తంగా

జాతీయ స్థాయి శిక్షణకు ఉపాధ్యాయుడు ఎంపిక



డైరెక్టర్ రమేశ్ నుంచి ప్రొసీడింగ్ పత్రాన్ని అందుకుంటున్న బ్రహ్మయ్య

మర్కూక్(గజ్వేల్): మండలంలోని దామరకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య జాతీయ స్థాయి వర్క్‌షాప్ శిక్షణకు ఎంపికయ్యారని విద్యాధికారి వెంకట్ రాములు తెలిపారు. మే నెలలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల భవనంలో ప్రదర్శించిన ఉత్తమమైన బోధన పద్ధతుల ద్వారా ఆయన ఎన్నికయ్యారు. ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి నూతన విద్యావిధానంపై వర్క్‌షాప్, శిక్షణకు వెళ్లనున్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీ భవనంలో డైరెక్టర్ రమేశ్ ప్రొసీడింగ్ పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఢిల్లీ సీసీఆర్టీ భవనంలో శిక్షణ పొందనున్నారని రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ సంస్థ సెక్రెటరీ నికోలస్ , జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు.

నర్మెటలో కొత్తరాతి యుగం పనిముట్టు



రాతి పనిముట్టు

నంగునూరు(సిద్దిపేట): నర్మెటలో మంగళవారం కొత్తరాతి యుగపు పనిముట్టు లభ్యమైనట్లు ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలోని పాటిగడ్డలో గతంలో ఆదిమానవుని అవశేషాలు అభ్యం కాగా అదే ప్రాంతంలో నేడు క్రీస్తుశ పూర్వం 2500 కిందటి రాతి పనిముట్టు దొరికిందన్నారు. దీనిని పరిశీలించగా త్రిభుజాకారంలో ఉన్న రాతి మధ్యలో హోల్ ఉందని, వస్తువుల బరువు తూకం వేసేందుకు ఉపయోగించినట్లు తెలుస్తోందని వివరించారు.

బైండోవర్ ఉల్లంఘన.. జరిమాన

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్‌పల్లె గ్రామానికి చెందిన దండ్ల రేణుక బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించారు. దీంతో తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు రూ.30 వేల జరిమాన విధించినట్లు ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. గతంలో గుడుంబా విక్రయించినందుకు బైండోవర్ చేయగా నిబంధనలు అతిక్రమించి మళ్లీ విక్రయించడంతో జరిమాన విధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రూప, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిజాంపేట(మెదక్): ఓ దాబాలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులతో పాటు యాజమానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఎస్‌ఐ రాజేశ్ సిబ్బందితో కలిసి దాబాపై దాడి చేశారు. యాజమాని గన్నరం వెంకటగౌడ్‌తోపాటు కుంచన రాజు, వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాస చంద్రం, కుక్కుడు నాగరాజు, శివుల్ల నర్సింహులు, కాస కైలాషలను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 10,170, ఐదు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్స్, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకుని, ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నం

రామాయంపేట(మెదక్): పట్టణానికి చెందిన విఠల్ నాయక్ కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. పట్టణంలో కూరగాయల వ్యాపారం చేసే విఠల్ గతంలో పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. మంగళవారం పట్టణ శివారులో వంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.

గంజాయి కేసులో మహిళకు జైలు



సావిత్రమ్మ

జహీరాబాద్ టౌన్: గంజాయి సాగు కేసులో కోర్టు మహిళకు జైలు శిక్షతో పాటు జరిమాన విధించింది. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి వివరాల ప్రకారం... ఝరాసంగం మండలం ఇస్లాపూర్ గ్రామానికి చెందిన బోయిని సావిత్రమ్మ(45) సొంత వ్యవసాయ భూమిలో గంజాయి సాగు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు 2020లో ఎక్సైజ్ అధికారులు దాడి చేసి 175 గంజాయి మొక్కలను ధ్వంసం చేసి ఆమెపై కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ బలంగా వాదనలు వినిపించారు. కేసు పూర్వపరాలు విన్న తరువాత జిల్లా అదనపు న్యాయమూర్తి కె.జయంతి నిందితురాలికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 25 వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

సామాజిక సేవలో.. మహిళామణులు

సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలు తమ శక్తిని చాటుతున్నారు. ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి అంటూ ఊరంతా సంబరాలు చేస్తూ తల్లీపిల్లను సన్మానిస్తున్నారు. మద్యపాన నిషేధం, బాల్యవివాహ వ్యవస్థ నిర్మూలన, సంపూర్ణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడమే కాకుండా మొక్కల సంరక్షణ, శ్రమదానం లాంటి సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. అందరి మన్ననలు పొందుతున్న హత్నూర మండలం నస్తీపూర్ వెలుగు మహిళా గ్రామైక్య సంఘం 25 ఏళ్ల ప్రస్థానంపై సాక్షి ప్రత్యేక కథనం.

– హత్నూర(సంగారెడ్డి):

ఆదర్శంగా నస్తీపూర్ వెలుగు మహిళా గ్రామైక్య సంఘం

- ఆడపిల్ల పుడితే ఊరంతా పండుగే..
- మద్యపాన నిషేధం, బాల్యవివాహాలపై అవగాహన
- స్వచ్ఛత, మొక్కల సంరక్షణకు కృషి
- ఆదర్శ సంఘంగా అవార్డు స్వీకరణ



ఆడపిల్లలు పుట్టిన తల్లి, పిల్లలను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నస్తీపూర్‌లో 1999లో స్థానిక సామాజిక సేవ కార్యకర్త రాగిబోగుడా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్రూపులతో వెలుగు మహిళా గ్రామైక్య సంఘాన్ని ప్రారంభించారు. ఈ సంఘం 25 ఏళ్లు పూర్తి చేసుకుని ఆదర్శంగా నిలిచింది. ప్రారంభంలో ఒక్కో సభ్యురాలు నెలకు రూ.30 జమ చేసేది. ప్రస్తుతం గ్రామంలో 19 మహిళా సంఘాలున్నాయి. ఇందులో 204 మంది సభ్యులుండగా.. ప్రస్తుతం ప్రతినెలకు రూ.500 జమ చేస్తున్నారు. ప్రతినెల 12న సమావేశం నిర్వహిస్తారు. ఎవరైనా ఆలస్యంగా వస్తే జరిమానగా రూ.100 చెల్లించాలని నిబంధన పెట్టుకున్నారు. గ్రామంలోని సామాజిక సేవ కార్యకర్త వెంకట్‌రెడ్డి 121 గజాల సొంత స్థలాన్ని మహిళా సంఘానికి ఉచితంగా ఇచ్చారు. దీంతో 2004లో సంఘ భవనం నిర్మించి జిల్లాకే ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం 20 లక్షల వరకు లావాదేవీలను గ్రామైక్య సంఘం సభ్యులు నిర్వహిస్తున్నారు.



వృద్ధులకు రాగి పిండి పంపిణీ

ఆదర్శ సంఘంగా అవార్డు

సంఘం ఆధ్వర్యంలో.. కుటుంబ సమస్యల పరిష్కారం, పండుగల నిర్వహణ, గ్రామం నుంచి విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని సైతం కల్పించారు. గ్రామంలో ప్రతినెల వైద్య పరీక్షలు చేయించడమే కాక 60 ఏళ్లు నిండిన సభ్యురాలిని సన్మానిస్తున్నారు. గ్రామం ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. గతంలో జిల్లా స్థాయిలో నస్తీపూర్ ఆదర్శ వెలుగు సంఘంగా అవార్డు అందుకుంది. సీఎస్‌ఆర్ కింద రూ.10 లక్షల నిధులు మంజూరు కావడంతో ప్రస్తుతం నస్తీపూర్‌లో వెలుగు మహిళా సంఘం భవనం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

సేవా కార్యక్రమాలు

వరద బాధితుల కోసం గ్రామంలో బియ్యం సమకూర్చి ప్రభుత్వానికి పంపించారు. 2004లో ప్రతి సభ్యురాలికి బ్యాంకు ఖాతా తెరిపించారు. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం, బాల్య వివాహాలు, వరకట్న దురాచారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 2023 డిసెంబర్ నుంచి గ్రామంలో ఆడపిల్ల పుట్టిన ప్రతి తల్లి, పిల్లను సంఘం ఆధ్వర్యంలో సన్మానిస్తున్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ఇప్పటివరకు సుమారు 25 మంది ఆడపిల్లల పేరుపై బ్యాంకు ఖాతా తెరిచి సంఘం సభ్యుల సొంత డబ్బులు రూ. వెయ్యి జమ చేశారు. రెండో నెల నుంచి ఆడపిల్ల బ్యాంకు ఖాతాలో కుటుంబ సభ్యులు రూ.వెయ్యి జమ చేయాలని, ఈ డబ్బు పాప పెళ్లికి ఉపయోగపడుతుందని అవగాహన కల్పిస్తున్నారు.

సమష్టి కృషితో..



సభ్యుల సమష్టి కృషితోనే జిల్లాలోనే ఆదర్శం సంఘంగా గుర్తింపు వచ్చింది. ఆడపిల్ల పుడితే నిరుత్సాహ పడకుండా మనోధైర్యాన్ని నింపి తల్లీపిల్లను సన్మానిస్తున్నాం. పండుగ వాతావరణంలో భోజనాలు ఏర్పాటు చేస్తున్నాం. బ్యాంకు ఖాతా తెరిచి పాప పేరుపై సుకన్య సమృద్ధి యోజన పథకం కింద రూ.వెయ్యి మొదటి నెల చెల్లిస్తున్నాం.

– గొడుగు స్వప్న, అధ్యక్షురాలు, గ్రామైక్య సంఘం

సంతోషంగా ఉంది



సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు సంఘం లావాదేవీలు క్రమం తప్పకుండా చూడటం సంతోషంగా ఉంది. ఈ గ్రామ సీసీగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. జిల్లా స్థాయిలో గతంలో అవార్డు కూడా అందుకున్నాం. మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు.

– కల్పన, ఐకేపీ సీసీ

అనుమానాస్పద స్థితిలో వివాహిత..



నాగరాణి

శివ్వంపేట(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందింది. ఈ ఘటన మండల పరిధిలోని చండీ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. మృతురాలి బంధువుల వివరాల ప్రకారం... రాయపోల్ మండలం ఎలకంటి గ్రామానికి చెందిన వెంకటమ్మ, శివయ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు నాగరాణి(35) ని చండీ గ్రామానికి చెందిన కుమ్మరి సత్యనారాయణతో ఐదేళ్ల క్రితం 10 తులాల బంగారం, కట్న కానుకలతో వివాహం జరిపించారు. వీరికి మొదటి సంతానం కూతురు పుట్టడంతో భర్తతోపాటు అత్త బాయమ్మ, మామ నర్సింహులు అదనపు కట్నం కోసం వేధించారు. పలుమార్లు పెద్దల సమక్షంలో కూడా మాట్లాడారు. చిన్న కూతురుకు ఎక్కువ కట్నకానుకలతో పెళ్లి జరిపించడంతో అప్పటినుంచి నాగరాణిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకున్నదని అత్తింటి వారు చెబుతున్నారు. మృతురాలికి కూతురు, కొడుకు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని మార్చురీకి తరలించారు. కాగా అత్తింటివారే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. ఇంట్లోని సామగ్రి, కారు అద్దాలు ధ్వంసం చేశారు. తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు గ్రామానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు.


గౌతాపూర్‌లో యువకుడు..



తేజ

వట్‌పల్లి(అందోల్): అదృశ్యమైన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గట్‌పల్లి(షాద్‌నగర్) గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లవకుమార్ వివరాల ప్రకారం... గౌతాపూర్ గ్రామానికి చెందిన బోయిని తేజ(23) ఈనెల 3న మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన సికిందర్‌తో కలిసి చేపలు పడుదామని బైక్‌పై వెళ్లారు. తేజ రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం మృతుని తండ్రి నర్సింలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం సింగూరు పరివాహక ప్రాంత నీటిలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఏఎస్‌ఐ సుధాకర్‌తోపాటు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. రెండు రోజుల క్రితం అదృశ్యమైన తేజగా గుర్తించారు. కాగా, మృతుడు తేజతో పాటు వెళ్లిన సికిందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఇద్దరం కలిసి వట్‌పల్లి వద్ద మద్యం తాగి, చేపలు పడుతున్న సమయంలో కొద్ది సేపటికీ తేజ కనిపించలేదని అతడు చెప్పాడు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా తేజ మృతదేహం లభ్యమైనట్లు సీఐ అనీల్‌కుమార్ తెలిపారు.

కీచక టీచర్‌ను కఠినంగా శిక్షించాలి



డీఈఓ కార్యాలయం ఎదుట స్కూల్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఇంగ్లిష్ టీచర్ వినయ్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహమాన్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ నాయకులు సంగారెడ్డి డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, సంస్థ యాజామాన్యానికి సంబంధించిన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ... శాంతినగర్‌లో గల సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనూ అదే పాఠశాలలో ఇలాంటి ఘటన జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగయ్య, పాండు, మహబూబ్, మున్నా, అసద్, శ్రీనివాస్, బాబు జగ్జీవన్ రామ్, సమతా సైనిక్ దళ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆడపిల్లలకు అండగా షీ టీం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గౌతమి

జహీరాబాద్: ఆడపిల్లలకు ఏ ఆపద వచ్చినా తాము ఎల్లవేళల అండగా ఉంటామని షీ టీమ్ మహిళా కానిస్టేబుల్ గౌతమి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడో ఒక చోట బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈవ్ టీజింగ్ జరిగితే వెంటనే షీ టీమ్‌ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. ఏ సమస్య వచ్చినా తాము వెంటనే స్పందించి ఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల గురించి వివరించి, వారి ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ నసీరుద్దీన్ మాట్లాడుతూ.. బాలబాలికలు లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. అందుకు వారి తల్లిదండ్రులే కారణం అవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు శంకర్ పటేల్, ప్రిన్సిపాల్ పద్మావతి, హెడ్ కానిస్టేబుళ్లు క్రిష్ణ గౌడ్, నసీరుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ మానస


దుబ్బాకటౌన్: ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం రాయపోల్ ఎస్‌ఐ మానస కేసు వివరాలు వెల్లడించారు. గత శనివారం రాయపోల్ మండల కేంద్రానికి చెందిన బాగ్గరి లక్ష్మి ఇంట్లో మధ్యాహ్నం ఎవరులేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి దొంగతనానికి పాల్పడి రూ.30 వేల నగదు, అరతులం బంగారు కమ్మలను ఎత్తుకెళ్లాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. రెండు రోజుల్లోనే నిందితుడు మహేందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు వద్ద నుంచి దొంగిలించిన నగదు, బంగారంను స్వాధీనం చేసుకున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జహీరాబాద్ టౌన్: పలువురు రౌడీషీటర్లకు జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ. వినయ్‌కుమార్ మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణంలోని పలు వార్డులకు చెందిన 15 మంది రౌడీషీటర్లను పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. నేరాలకు పాల్పడినా, వాటిని ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై నిఘా ఉంటుందని చెప్పారు.

ఫైలేరియాను నిర్మూలిద్దాం

జిల్లా మలేరియా అధికారి ప్రవీణ్‌కుమార్



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): జాతీయ ఫైలేరియా నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకోవాలని ఫైలేరియా జిల్లా అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గుమ్మడిదల, కానకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వైద్య సిబ్బందికి పలు సూచనలు సలహలు చేశారు. ఈ నెల 25 వరకు అర్హులైన ప్రతిఒక్కరికి ఆల్బెంబజోల్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులను దరిచేరకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యబృందం సభ్యులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమలో లీకైన కెమికల్

- 8 మంది కార్మికులకు అస్వస్థత
- కూచారం పరిశ్రమల వాడలోని శ్రీయాన్స్ ల్యాబ్‌లో ఘటన



ఇబ్బందులకు గురైన కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): ఓ పరిశ్రమలో కెమికల్ గ్యాస్ లీకై ఎనిమిది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. కాగా అప్పటికే సిబ్బంది అప్రమత్తమై లీక్‌ను ఆపివేశారు. ఈ ఘటన మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ శివారులోని పరిశ్రమల వాడలో గల శ్రీయాన్స్ ల్యాబ్ పరిశ్రమలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... శ్రీయాన్స్ ల్యాబ్‌లో వ్యవసాయానికి ఉపయోగపడే కెమికల్స్‌ను తయారు చేస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం కెమికల్ సిలిండర్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేయడానికి పైపు బిగించే క్రమంలో లీకైనట్లు కార్మికులు తెలిపారు. అదే సమయంలో విద్యుత్ ఆగిపోవడంతో లీక్‌ను నియంత్రించడంతో ఆలస్యం జరిగినట్లు పేర్కొన్నారు. దీంతో అక్కడ పని చేస్తున్న ప్రభాకర్, యోగేశ్ రాయ్, వెంకటరమణ, కేశవ, మహేందర్‌లతోపాటు మరో ముగ్గురు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడ్డారు. కాగా అప్రమత్తమైన సిబ్బంది లీక్‌ను ఆపివేయడంతో కొద్దిసేపటి తర్వాత వాసన నిలిచిపోయినట్లు సిబ్బంది తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మనోహరాబాద్, తూప్రాన్ నుంచి 108 అంబులెన్సు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కార్మికులకు ప్రథమ చికిత్స అందించారు. పరిశ్రమలో ప్రమాద నివారణకు సంబంధించిన పరికరాలుండటంతో పరిశ్రమ వద్ద ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. పరిశ్రమలో పని చేస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో కార్మికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్పత్తులు నిలిపివేయండి..

కాలుష్య నియంత్రణ మండలి ఉత్తర్వులు



శ్రీయాన్స్ ల్యాబ్స్...

సనత్‌నగర్: క్లోరిన్ గ్యాస్ లీకై న ఘటనలో మనోహరాబాద్ మండలం కుచారం గ్రామం ఇండస్ట్రియల్ పార్కులో కొనసాగుతున్న శ్రీయాన్స్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) స్పందించింది. ఆ కంపెనీ కార్యకలాపాలను నిలివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఉదయం 9.30 గంటలకు పరిశ్రమ నుంచి గ్యాస్ లీకేజీ కారణంగా వాయు కాలుష్యం, దుర్వాసన వస్తుందని సమీపంలో ఉన్న పలు పరిశ్రమల నుంచి బోర్డుకు ఫిర్యాదులు అందాయి. వెంటనే టీజీపీసీబీ ఆర్‌సీపురం అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశ్రమతోపాటు పరిసరాలను పరిశీలించారు. శ్రీయాన్స్ ల్యాబ్స్ ప్రాంగణంలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకైనట్లుగా గుర్తించారు. ఇసుకలో, అలాగే చుట్టుపక్కల గాలిలోకి గ్యాస్ వ్యాపించినట్లు నిర్ధారించారు. లీకేజీ సమయంలో పరిశ్రమ డీజిల్ జనరేటర్ సెట్ పలు భద్రతా లోపాలతో వెంటనే పనిచేయలేదన్నారు. పరిశ్రమ ముందు జాగ్రత్త, నియంత్రణ చర్యలు అమలు చేయడంలో విఫలమైనట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ ఘటన తీవ్రత దృష్ట్యా శ్రీయాన్స్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-2 ఉత్పత్తులను నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

సీఈఐఆర్ ద్వారా మొబైల్ ఫోన్ రికవరీ

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



బాధితులకు మొబైల్ ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి జోన్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ రికవరీ చేసి బాధితులకు అందజేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో రికవరీ చేసిన 259 ఫోన్లను మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దొంగిలించిన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గతవారం రోజుల క్రితం ఐటీ, సైబర్ సెల్, ఎస్‌న్యాబ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి రికవరీ చేశామన్నారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా.. దొంగిలించిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వినియోగించిన మొబైల్ ఫోన్ ఎక్కడైనా కొనుగోలు చేస్తే తప్పనిసరిగా సంబంధిత వ్యక్తుల నుంచి రసీదు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలతో పాటు అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ టీం ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు రాజలింగం, రవి, భవాని, స్నేహలత, హరికృష్ణ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం తాళాలివ్వండి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు చుక్కరాములు



తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు

జహీరాబాద్ టౌన్: డబుల్ బెడ్రూం ఇళ్ల తాళాలు ఇవ్వాలని, లేనిచో లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు అధికారులను హెచ్చరించారు. మంగళవారం సీపీఎం నాయకులు లబ్ధిదారులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ... గత ప్రభుత్వం హోతి(కె) వద్ద ఇళ్లను నిర్మించిందని, అధికారులు డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి సర్టిఫికెట్లను పంపిణీ చేశారని చెప్పారు. రెండేళ్లు గడుస్తున్నా ఇళ్లను అప్పగించలేదన్నారు.

13న ఇళ్లు పంపిణీ చేస్తాం : తహసీల్దార్

కాగా ఆందోళన చేస్తున్న నాయకులతో రెవెన్యూ, పోలీసు అధికారులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దశరథ్ మాట్లాడుతూ... లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టి స్క్రీనింగ్ చేమన్నారు. 660 మందిలో స్క్రీనింగ్ చేయగా 134 మంది అనర్హులు ఉన్నట్లు తెలిసిందని, అర్హులైన వారికి ఈ నెల 13న ఇళ్లను పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ మేరకు కలెక్టర్ ప్రావీణ్య జారీ చేసిన ఆర్డర్ కాపీని ఆయన నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జయరాజ్, రాంచందర్, మహిపాల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు

తహసీల్దార్ రవికుమార్



రక్షాబాటను ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

కంది(సంగారెడ్డి): ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని వడ్డెను గూడాతండా శివారులో కబ్జాకు గురైన నక్షబాటను పోలీసులు సహకారంతో తిరిగి ఏర్పాటు చేశారు. ఈనెల 29న పొలాలకు వెళ్లే నక్షబాటను కొందరు కబ్జా చేశారని ఆరోపిస్తూ తండావాసులు రైతులు ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఫిర్యాదు అందడంతో స్పందించిన తహసీల్దార్ పోలీసుల సహకారంతో జేసీబీలతో నక్షబాటను తిరిగి ఏర్పాటు చేయించారు. దీంతో తమ పొలాలకు వెళ్లేందుకు బాటను ఏర్పాటు చేయించిన తహసీల్దార్‌కు తండావాసులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రంగయ్య, సర్వేయర్ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలు లేని రీసర్వే రికార్డుల రూపకల్పన

అందోల్ ఆర్డీఓ పాండు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పాండు

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం భూముల రీసర్వేను పూర్తి చేసి సంబంధించిన రికార్డులను తయారు చేస్తున్నట్లు అందోల్ ఆర్డీఓ పాండు తెలిపారు. మంగళవారం వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై భూముల రీసర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన మండలంలోని షాద్‌నగర్ గ్రామంలో డీఐఎల్ఆర్ఎంపీ మార్గదర్శకాలకు అనుగుణంగా డ్రోన్ సహాయంతో ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతిలో రీసర్వే చేపట్టామన్నారు. గ్రామంలో మొత్తం 21 సర్వే నంబర్లకుగాను 693 ఖాతాదారులకు సంబంధించిన 593 ఎకరాల్లో రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. ఏ సర్వే నంబరులో ఎంత భూమి ఉంది. గ్రామ భూములతో పాటు గ్రామ కంఠంలో ఎన్ని ఎకరాల భూములున్నాయి. అసైన్డ్ భూములు ఎన్ని? అనే లెక్క తేల్చారు. రికార్డులో ఉన్న భూమికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి తేడాలను గుర్తించారు. సర్వే ద్వారా హద్దులను నిర్ధారించి నక్షపటాన్ని రూపొందించామన్నారు. త్వరలో సంబంధిత రికార్డులను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ల్యాండ్ ఆఫ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఐనేష్, తహసీల్దార్ చంద్రశేఖర్, సర్వేయర్ మురళి తదితరులు పాల్గొన్నారు.